ఈవారం కథ



# మీరూ ఆలోచించండి!

కొళ్ళకూరి కృష్ణ

## లంచ్ రూం

గాయత్రికి 'గ్రీవెన్స్‌సెల్' మధ్యాహ్నం లంచ్‌బెల్ కొట్టగానే పిల్లలంతా బిలబిలా చెట్ల క్రిందకు చేరతారు. మగ టీచర్లకు లంచ్ బాక్సుల్లో తెచ్చుకోవటం, తినటం నామోషీ. అందువల్ల బయటకు వెళతారు. ఇక మిగిలేది గాయత్రీ, ఆలేఖ్యా. ఇద్దరూ ఆ రూములోనే లంచ్ చేస్తారు.

ఆలేఖ్యా, గాయత్రీ ఇద్దరూ కాన్వెంట్ టీచర్లే. ఈ స్టేట్‌మెంట్ ఎలా వుందంటే సర్వేపల్లి రాధాకృష్ణనూ, సరిపల్లి సుబ్బారావూ ఇద్దరూ ఉపాధ్యా

యులే అన్నట్టు వుంది. సరిపల్లి సుబ్బారావు పేరు మీరెప్పడూ వినలేదా? మీరే కాదు. సరిపల్లిలోనే ఆయన పేరు అందరూ విని వుండరు. ఆయన ఆ వూరి మునిసిపల్ హైస్కూలు టీచరు. రాధాకృష్ణన్‌కీ, సుబ్బారావుకీ అధ్యాపకత్వం ఒకటే కామన్. సుబ్బారావు వంటి టీచర్లు దేశంలో లక్షల మంది వున్నారు. ప్రపంచానికి 'రాధాకృష్ణన్' ఒక్కడే. ఆలేఖ్యా, గాయత్రీ అలా అన్నమాట. అంటే ఆలేఖ్య రాధాకృష్ణన్ వంటి 'మేధావి' అని కాదు. కానీ, ఆర్థికంగానూ, సామాజికంగానూ ఎన్నో అంతస్తులు గాయత్రికంటే పైన వున్న ఆలేఖ్యకూ, ఆమెకూ కామన్ అయిన విషయం ఆ స్కూల్లో టీచర్లుగా పని చెయ్యడమే.

ఆలేఖ్య నగరంలోని ప్రముఖ న్యూరో సర్జన్ కృష్ణమోహన్ భార్య. ఆమె పెళ్ళినాటికి ఒక యమ్మే, పెళ్ళయ్యాక రెండు యమ్మేలు చేసింది. కృష్ణమోహన్ ప్రైవేటు ప్రాక్టీసుతో ఉదయం నుండీ రాత్రి వరకూ భారీ ఎత్తున డబ్బు సంపాదిస్తాడు. ఉన్న ఒక్క కొడుకుని డెహ్రాడూన్‌లో చదివిస్తున్నాడు. మారుతీకారులా, పామేరియన్ కుక్కలా, చదువుకున్న భార్యలా, డూన్ స్కూల్లో చదివే కొడుకు స్టేటస్ సింబల్. అక్కడ క్రమశిక్షణ, విద్య చాలా బాగుంటాయేమో... కానీ మన వూళ్ళో కూడా బానే వుంటాయి అనుకుంటుంది ఆలేఖ్య. 'డూన్ స్కూల్లో రాజీవ్‌గాంధీ చదివాడు' అంటాడు కృష్ణమోహన్. రాజీవ్‌గాంధీ మేధావి కాదు. ఈ దేశపు ప్రధానిగా వున్న మాట నిజమే. కానీ అది డూన్ స్కూల్లో చదివినందువల్ల కాదు. నెహ్రూ మనుమడయినందువల్ల ఇంకా అరుణ్‌పూరి మాట చెప్పినా వయమే అనుకుంటుంది ఆలేఖ్య. పూరీ ఎవరో కృష్ణమోహన్‌కి తెలియదు. డబ్బుతో సంబంధంలేని వాళ్ళూ, డబ్బు సంపాదించని వాళ్ళు ఎవరూ అతనికి తెలియదు. తెలుసుకోవాలన్న ఆసక్తీ లేదు. ఆలేఖ్య అత్తగారూ, మామగారూ హైదరాబాద్‌లో వుంటారు. ఆడపడుచు, ఆమె భర్తా ఇక్కడ కృష్ణమోహన్ చేస్తున్న పనినే విదేశాల్లో ఇంకొంచెం భారీ ఎత్తున చేస్తున్నారు. బయటవాళ్ళకు ఆలేఖ్య జీవితం 'అబ్బో! ఎంత అదృష్టమో! నిరాసక్తమయిన ఆ జీవితం 'నుంచి పారిపోవటానికే ఆలేఖ్య ఈ కాన్వెంట్‌ని ఎన్నుకున్నది. ఆర్థికంగా ఆస్థితిలో వున్న స్త్రీలు మనకు మహిళా మండలిలోనూ, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ కన్పిస్తారు. కాన్వెంటుల్లో కన్పించరు. కృష్ణమోహన్ భార్య ఈ ఉద్యోగం చేస్తానన్నప్పడు బాగా పోట్లాడాడు. కొంచెం హుందా అయిన ఉద్యోగం చెయ్యొచ్చుకదా అన్నాడు. ఆలేఖ్య మొండి తనానికి చివరకు తలొగ్గక తప్పింది కాదు.

గాయత్రి భర్త నళినీకాంతరావు 'కలక్టరేట్'లో గుమాస్తా. ఇద్దరు పిల్లలు. పెద్దవాడు వాళ్ళింటి దగ్గరే వున్న మున్సిపల్ స్కూల్లో అయిదవ తరగతి చదువుతున్నాడు. చిన్నది ఆడపిల్ల. ఇంకా బడిలో వెయ్యలేదు. ఆమె సంతోషంగా వుండకపోవడానికి పెద్ద కారణాలేవీ కన్పించవు. అత్తమామలు తప్ప. ముఖ్యంగా అత్తగారు. ఆవిడ పేరు లలితమ్మ. ఆవిడా, గాయత్రీ రోడ్డునపడి కొట్టుకోరు. కానీ ఆలేఖ్యకు అర్థం అయిందేమంటే వాళ్ళిద్దరికీ ఏ విషయంలోనూ ఏకాభిప్రాయం లేదు. చాలా మంది అత్తాకోడళ్ళలాగే ఉదయం కాఫీల దగ్గర్నుంచీ రాత్రి పడకల వరకూ ఏదో ఒక విషయంలో వాగ్యుద్ధం జరిగి తీరాల్సిందే. అలా జరిగిన మరుక్షణమే లలితమ్మ తమ గదిలోకి వెళ్ళి భర్తతో సంగతి ఆసాంతమూ విశదీకరిస్తుంది. గాయత్రికి కూడా భర్తకు చెప్పకోవాలనే వుంటుంది. కానీ నళినీకాంతరావుకి తండ్రిలాగ 'టైం' వుండదు. ఆడవాళ్ళ సొద వినడానికి. వినే ఓపికా లేదు. ఎప్పడయినా గాయత్రి బలవంతంగా వినిపిస్తే "ఆవేం పట్టించుకోకు" అంటాడు ముక్తాయింపుగా. తను చెప్పేది ఎప్పడు పూర్తవుతుందా అన్నట్టు అసహనంగా కుర్చీలో అటూ ఇటూ కదిలి ఆఖరున పట్టించుకోకు అనే భర్తతో గాయత్రికి మంచి శ్రోత దొరకలేదు. ఆ శ్రోత ఆలేఖ్యలో దొరికింది. ఆలేఖ్య గాయత్రి సోదంతా చాలా సానుభూతిగా వింటుంది. అప్పడప్పడూ సలహాలు కూడా ఇస్తూ వుంటుంది.

గాయత్రి ఆలేఖ్యను మొదట్లో చాలా దూరం వుంచింది. ఆలేఖ్య కట్టే గిరిజా సిల్కు చీరెలు, చెవులకున్న డైమండ్ స్టడ్స్ ఆమెను చాలా భయపెట్టాయి. 'మారుతీ 1000'లో రయ్‌మని దూసుకొచ్చే ఆలేఖ్య ముందు తనను తాను పిడికెలంత భావించుకునేది. తరువాత ఆలేఖ్య కారు వదిలేసి 'లూనా' కొనుక్కుంది. మామూలుగా స్టీలు బాక్సులో లంచ్ తెచ్చుకునేది. అదీకాక ఆ 'సోకాల్డ్ కాన్వెంటు'లో వీళ్ళిద్దరే ఆడటీచర్లు. ఆ విధంగా కూడా ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం పెరిగింది.

గాయత్రి కష్టాలు తీరేవి కావు. కనీసం ఆమె అత్తగారు బ్రతికి వున్నంతవరకూ! లంచ్ బాక్స్‌తో పాటే ఆమె ఫిర్యాదుల మూట విప్పతుంది. లంచ్ తిన్నంతసేపూ ఏదో ఒకటి చెవుతూనే వుంటుంది. "శలవు రోజు ఒక్క అరలీటరు పాలు ఎక్కువ తెప్పించాలంటే ఎంతగొడవనుకున్నారు? మా ఆయనేమో రోడ్డు మీద కనపడిన ప్రతివాడినీ ఇంట్లోకి లాక్కొచ్చి 'గాయీ! కాఫీ' అంటారు. గాయత్రి బదులు 'గాయ్'నయినా బావుండేది. కాసిని పాలివ్వగలిగి వుండేదాన్ని. అత్తయ్యేమో! ఎందుకే ఎక్స్ట్రాపాలు? దుబారా చెయ్యొద్దు అంటారు. ఆ మైదాపిండి వుడికించి చీరెలకు గంజి పెట్టడం ఓ బండచాకిరీ 'రివైవ్' వాడి చూద్దామంటే చాల్లే సంసారమేనా? అంటారు. పండుగ వస్తే ఆవిడ బూరెలు చేయాలంటారు. గాయత్రి బొబ్బట్లు అంటుంది. మళ్ళీ వాటి కొలతల దగ్గరపేచీ. అత్త ఎక్కువ చేద్దామంటే కోడలు తక్కువ చెయ్యాలంటుంది. చివరికి కూరలు చేసే విధానంలో కూడా ఇద్దరికీ ఏకాభిప్రాయం కుదరదు.'శనగపప్ప వుడికించి వంకాయల్లో వేయమంటే వినరు. రెండూ కలిపి వుడుకుతాయి లెద్దూ అంటారు. మీరు చెప్పండి 'ఏది సరయిన పద్ధతో!' అనడుగుతుంది గాయత్రి. ఆలేఖ్యకు వంట సరిగా రాదు. కానీ తడుముకోకుండా 'మీరే కరెక్టు గాయత్రీ. శనగపప్ప ముందు

## శలవుకి సెలవెందుకు?

యదార్థగాథలు

ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి 1947 ప్రాంతంలో ముఖ్యమంత్రిగా వ్యవహరించిన టంగుటూరి ప్రకాశం పంతులుగారికి, కాంగ్రెస్ హైకమాండ్‌తో కొన్ని చిక్కులు వస్తే, సహచరులైన తన కేబినెట్ మంత్రులతో రోజూ ఏదో ఒక చీకాకు ఏర్పడేది. వాళ్ళంతా మంచివాళ్ళే! కాని అనుభవం, వ్యవహారజ్ఞానం తక్కువ కావడంతో, ఆయనకి తలనెప్పి తీసుకు వచ్చేవారు వారిలో కొందరు.

అలా తీసుకువచ్చిన వారిలో వేముల కూర్మయ్యగారు ఒకరు. ఆయన మంత్రికావడంవల్ల, ఆ శాఖ సెక్రటరీపైన కూడా ఆయనదే పెత్తనం. కాని అది ఆయనకి తెలియదు. అందువల్ల రెండు రోజులు ఊరువెళ్ళవలసివచ్చి శలవు మంజూరు చెయ్యవలసినదిగా తన సెక్రటరీకి శలవు చీటి పంపించారు మంత్రివర్యులైన కూర్మయ్యగారు.

కొంటవాడైన ఆ సెక్రటరీ, తిన్నగా ఆ శలవు చీటీ పట్టుకెళ్ళి ముఖ్యమంత్రిగారికి చూపించారు. 'సరే నువ్వు వెళ్ళు' అని టంగుటూరి వారు తరువాత కూర్మయ్యగారిని పిలిపించి "ఏమిటిది? వాడు నీ ఆజ్ఞని పాలించేవాడు. వాడికి శలవు చీటీ పంపావేమిటి" అని కోప్పడ్డారు. "మరైతే ఇక నుంచి మీకు పంపించమంటారా?" అని అమాయకంగా అడిగారు కూర్మయ్యగారు" "ఎవరికీ పంపక్కర్లేదు" కసురుకున్నారు ప్రకాశంగారు. "అదెలా?" – కూర్మయ్యగారు సందేహం వెలిబుచ్చారు. "ఏం? శలవు చీటీ పంపించకపోతే తోచదా? సరే – నాకు పంపిస్తూ వుండు. నేనీ చిత్తుబుట్టలో పడేస్తూ వుంటాను" అన్నారు పంతులుగారు విసుక్కుంటూ, కోపంగా.

– పోలాప్రగడ

వుండికించుకోవద్దూ' అంటుంది. దానికి పెద్ద కారణం ఏం లేదు. లలితమ్మ ఆలేఖ్యకు తెలీదు. గాయత్రి తెలుసు. ఆమెను నొప్పించడం దేనికి?

ఒక్కొక్కసారి, ఇంటికి వెళ్ళినా గాయత్రి మాటలు పదేపదే జ్ఞప్తికి వస్తాయి. ఎందుకు ఒకే ఇంటిలోని ఇద్దరు స్త్రీలు యింతగా విభేదించుకుంటారు? అని ఆలోచిస్తుంది. ఆమెకు ఒక్కొక్కసారి సమాధానం కూడా స్ఫురిస్తుంది.

## 2

ఆ రోజు కాన్వెంటుకు వచ్చేక ఏదో పార్టీ వాళ్ళు ఆకస్మాత్తుగా 'బంద్' ప్రకటించారు. స్కూలు మూసెయ్యమని హెడ్ మిస్ట్రెస్‌ని ఒత్తిడి చేశారు. ఆలేఖ్య, గాయత్రీ పిల్లలందరినీ దగ్గరుండి జాగ్రత్తగా తిరిగి రిక్షాలు ఎక్కించారు. ఆలేఖ్యలో అందరూ ఇష్టపడే సుగుణం అదే. స్కూలు మూసెయ్యగానే ఆమె 'లూనా' ఎక్కి ఇంటికి వెళ్ళిపోయి వుండవచ్చు. కానీ అందరు టీచర్లతో పాటు శ్రద్ధగా బాధ్యతగా స్కూలు పనుల్లో భాగం తీసుకుంటుంది. ఆమె 'శ్రీమతి కృష్ణమోహన్'ని అని మరచిపోయే ప్రదేశం బహుశా ఇదొక్కటే.

ఆ కార్యక్రమం పూర్తయ్యేసరికి పదకొండ గంటలయింది. ఇద్దరూ రోడ్డు మీదకు వచ్చి ఆలేఖ్య 'లూనా' స్టార్ట్ చేయబోయేంతలో

"అబ్బ! ఇంటికి వెళ్ళి ఏం చెయ్యాలో తోచదు. బోర్" అంది గాయత్రి.

ఆలేఖ్య కాలుదించి "ఏం?" అని ప్రశ్నించింది.

"మా ఆడపడుచు భర్తకు చిన్న యాక్సిడెంట్ అయింది. మా ఆయన, అత్తయ్యా; మామయ్య అంతా కట్టకట్టుకుని పోయారు. పిల్లల్నీ కూడా తీసుకెళ్ళారు."

ఒక్కక్షణం తటపటాయించి "పోనీ, మా ఇంటికి రండి" అని ఆహ్వానించింది ఆలేఖ్య.

గాయత్రి "వద్దులెండి" అంది మొహమాటపడుతూ.

"ఫర్వాలేదు రండి" అని వెనుక ఎక్కించుకుని ఇంటికి తీసుకు వెళ్ళింది.

"ఆలేఖ్య కృష్ణమోహన్ భార్య. చాలా డబ్బున్న వాళ్ళు!' అని తెలుసు గాయత్రికి. తెలియడం వేరు, చూడటం వేరు అనుకుంది గాయత్రి ఆ ఇంటినీ, ఆ సంపదనీ చూసి.

గాయత్రిని డ్రాయింగ్‌రూమ్‌లో కూర్చోపెట్టి టీవీ ఆన్‌చేసి, రెండు మ్యాగజైన్లు ముందు పడేసి ఆలేఖ్య లోపలకు వెళ్ళింది. ఒక కుర్రవాడు గాజు గ్లాసులో చల్లటి మంచినీరు తెచ్చి అందించాడు. అయిదు నిమిషాల తరువాత వంట మనిషి కాబోలు అద్భుతమయిన 'కాఫీ తెచ్చి యిచ్చింది.' పాలల్లో చుక్క నీరు కూడా కలపకుండా పొడి వేసేసినట్లున్నారు' అనుకుంది గాయత్రి ఆ రుచిని ఆస్వాదిస్తూ. తమింట్లో అతిథివస్తే అత్తయ్య, తామా అతను కాఫీ ఇవ్వదగిన వాడేనా? కాదా? పాలున్నాయా? లేదా? అని ఎంత మల్లగుల్లాలు పడతారో గుర్తొచ్చి నిట్టూర్చింది.

ఆలేఖ్యతోపాటు గదిలోకి ఇంకొక ముసలావిడ వచ్చింది. "మా అత్తగారు" అని పరిచయం చేసింది ఆలేఖ్య. ఎప్పుడూ తనగొడవేకానీ ఆలేఖ్య విషయాలేవీ తనకు తెలియనందుకు మొదటి సారిగా సిగ్గుపడింది గాయత్రి.

"నాతో పని చేస్తుంది. గాయత్రి" అని అత్తగారికి పరిచయం చేసింది. ఆమె గాయత్రిని పిల్లలెందరు? భర్త ఏం చేస్తాడు? వంటి రెండు సాదా సీదా ప్రశ్నలు వేసి "మీరు మాట్లాడుకోండి" అని లేచి వెళ్ళిపోయింది. తన అత్తగారిలా చాటు నుంచి వింటుందేమో అనుకుంది గాయత్రి. కానీ ఆవిడ లోపలిగదుల్లోకి ఎక్కడికో వెళ్ళిపోయింది.

"అత్తగారు వచ్చి నాలుగు రోజులయింది. రేపు వెళ్ళిపోతారు" అంది ఆలేఖ్య.

"అప్పుడే?" అంది గాయత్రి ఆశ్చర్యపోతూ.

"ఎప్పుడూ అంతే" అని సమాధానం యిచ్చింది ఆలేఖ్య నిర్లిప్తంగా.

గాయత్రి వెళ్తానని లేస్తే భోంచేసి వెళ్ళమంది ఆలేఖ్య. భోజనం ఆలేఖ్యా, ఆమె అత్తమామలూ, గాయత్రీ అంతా కలిసే చేశారు. తీరా భోజనం మొదలుపెట్టే ముందు ఆలేఖ్య అత్తగారు,

"ఆయన దుంపలు మానేశారుగా అమ్మాయ్! బంగాళదుంప వేయించారేం?" అనడిగింది.

"ఓ! మర్చిపోయాము. వర్షమ్మా! ఒక ఆమ్లెట్ వెయ్యి" అంది ఆలేఖ్య.

ఇందాక కాఫీ తెచ్చిచ్చిన మనిషి అయిదు నిమిషాల్లో ఆమ్లెట్ వేసి తెచ్చింది. కాయగూరల భోజనమే కానీ తమ యింటి భోజనానికీ, ఈ భోజనానికి సంబంధం లేదనిపించింది గాయత్రికి. పెరుగయితే మరీ మరీ వచ్చింది. చిన్నతనంలో అమ్మమ్మ ఇంట్లో తిన్న పెరుగు తర్వాత ఇంత మంచి పెరుగు తినటం ఇప్పుడే! భోజనం తరువాత ఒక రసగుల్లా, ఒక చక్కెరకేళీ వడ్డించారు. ఒక పావుగంట తర్వాత గాయత్రి ఇంటికి వెళ్ళిపోయింది.

## 3

మూడు రోజులపాటు గాయత్రి లంచ్‌రూమ్‌లో ఏమీ మాట్లాడలేదు. ఈ నిశ్శబ్దం వింతగా తోచింది ఆలేఖ్యకు. నాలుగో రోజు తానే కల్పించుకుని,

"మీ అత్తగారూ వాళ్ళు వూరి నుంచి వచ్చేశారా గాయత్రీ?" అని ప్రశ్నించింది.

"ఆ! వాళ్ళతోపాటు మా ఆడపడుచూ, ఆమె భర్తా కూడా వచ్చారు - ఆయన వైద్యానికి."

"మరి వాళ్ళ పిల్లలు?"

"మా ఆడపడుచు అత్తగారు వున్నారు. ఆమె చూసుకుంటారు..." చాలా సేపు ఇద్దరూ మాట్లాడుకోలేదు.

"దేనికయినా పెట్టివుట్టాలి" అంది గాయత్రి నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

ఆలేఖ్యకు అర్థమయింది - ఆమె ఉద్దేశం ఏమిటో, ఎందుకలా అన్నదో. నాలుగు రోజులుగా ఆలేఖ్య ఇల్లు చూసినది మొదలు గాయత్రిని అసంతృప్తి పురుగులూ దొలుస్తూనే వుంది. ముఖ్యంగా ఆ అత్తాకోడళ్ళ సామరస్యం! గాయత్రిని కలవరపరిచింది సంపద కంటె ఆ సామరస్యమే.

ఆ సాయంత్రం స్కూలు వదిలాక ఆలేఖ్య గాయత్రిని ఆపింది.

"కాసేపు వుండండి. మీతో మాట్లాడాలి" అంది. ఎటువంటి ఉపోద్ఘాతమూ లేకుండా ఆమె మాట్లాడిన మాటల సారాంశం ఇదీ:

"గాయత్రీ! జిడ్డు కృష్ణమూర్తిగారనుకుంటా ఒక చోట అంటారు - సామ్యమూ, ఈర్ష్యా (కంపేరిజన్, జెలసీ) మన గుండె మీద వుండు వంటిది. అవి మనకే బాధని కలిగిస్తాయి. ఎదుటివాడికి కాదు" అని. నాకు అర్థమయినదేమంటే మా ఇల్లు స్వర్గధామం అనీ, మా అత్తగారు దేవతనీ మీకొక భావం ఏర్పడిపోయింది. అందువల్ల మీ

---

డా. రాధాకృష్ణన్ మొదటిసారి గాంధీజీని కలిసినప్పుడు వారి సంభాషణ ఇలా జరిగింది.

"మీరు శాఖాహారులా?" గాంధీ ప్రశ్న.

"అవును" డా. రాధాకృష్ణన్.

"మీరు పాలు తాగుతారా?" గాంధీ ప్రశ్న.

"ఆ-తాగుతాను" డా. రాధాకృష్ణన్.

"అయితే మీరు మాంసాహారులే-ఎందుకంటే పశువుల్ని బాధించి పాలు తీస్తారు కదా!" గాంధీ అన్నారు.

"అయితే మనమంతా నరమాంస భక్షకులం-తల్లిపాలు తాగుతాం కదా!" డా. రాధాకృష్ణన్ అన్నారు.

- వీరభద్రరావ్ పమ్మి



సంసారం కలహాల పుట్టగా, మీ అత్తగారు గంప గయ్యాళిగా మీకు తోస్తూండవచ్చు. కానీ, మీరు నా వైపునుంచీ కూడా ఆలోచించి చూడాలి. నేను మీ గురించి కూడా ఈర్ష్యపడే అంశాలున్నాయ్. ఆశ్చర్యం కలిగినా ఇది నిజం!

సమిష్టి కుటుంబాలన్నీ సమస్యల పుట్టలనీ, వేరు కాపురాలు స్వర్గధామాలనీ అనుకోవటం పొర పాటు. గాయత్రీ! మీకూ, మీ అత్తగారికి గల అభిప్రాయభేదాలన్నిటికీ మూల కారణం ఆర్థిక సమస్యే. అరలీటరు పాలు ఎక్కువ వద్దన్నా, అర కేజీ శనగపప్పు ఎక్కువ వండొద్దన్నా మీ అత్తగారు మీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అనివుం డొచ్చు. మా ఇంటిలో ఈ విధమయిన ఆర్థిక ఇబ్బందీ, తత్ఫలితంగా వచ్చే కలతలూ లేకపోయి వుండొచ్చు. కానీ, ఆత్మీయత విషయానికి వస్తే మీరు మాకంటె ఎన్ని రెట్లో పై అంతస్తులో వున్నారు. మీ అత్తగారు మీతో కలిసి వుంటారు. అందుకే ఇన్ని వాగ్యుద్ధాలు, అపార్థాలూ. కానీ, అందులో వున్న సుఖాల్ని మీరు గ్రహించడం లేదు. పోయిన సంవత్సరం తొమ్మిది నెలలు మీరు బియ్యీడీ చదువుతోంటే మీ పిల్లల్నీ, భర్తనీ, ఇంటినీ కనిపెట్టి వున్నదెవరు? ఆమే. అంతవరకూ ఎందుకు? మీరు ఉదయం కాన్వెంటుకి వస్తారు. సాయంత్రం వరకు ఇల్లు చేరరు. మీ ఇంటికి కాపలా కాసేదెవరు? మీకూ, మీ భర్తకూ, పిల్లలకూ సమస్త సౌకర్యాలూ చూసేదెవరు? మీరూ ఆమెని అంతగానే ఆద రిస్తున్నారు గాయత్రీ! ఆమెకి జ్వరం వస్తే మీరు క్యాజువల్ లీవ్ పెట్టి ఆమెను చూసుకున్నారు. మీ మామగారికి 'పెరాలిటిక్ స్ట్రోక్' వస్తే మీ భార్యాభర్తలిద్దరూ జీతం నష్టం మీద శలవుపెట్టి ఆసుపత్రికీ, ఇంటికీ మధ్య తెగ తిరిగారు. ఆ విష యమై మీరెప్పుడూ ఫిర్యాదు చెయ్యలేదు కూడా. ఇప్పుడు ఆడపడుచు భర్తకు దెబ్బతగిలితే ఇద్దరినీ తెచ్చుకుని ఇంట్లో పెట్టుకున్నారు. ఇది ఆర్థికంగా ఇబ్బందే. చాకిరీయే. కానీ ఆ ఆర్థిక ఇబ్బం దులకూ, చాకిరీకి కారణం ఏమిటి? కష్టాల్లో

> **కథలు**
>
> "అదేంటి నువ్వీ మధ్య కథలు రాయడం మానేసావు?" అడిగింది లక్ష్మి.
>
> "ఇది వరకు మా ఆయన ఇంటికి ఆలస్యంగా వచ్చి ఏదో ఓ కొత్త కథ చెప్పే వారు. మరిప్పుడు ఆయన రిటైర్ అయి పోయారు కదా". అసలు విషయం చెప్పింది కమల.
>
> —పి.ఎస్.కుమార్


ఆదుకోవలసిన మీ బాధ్యత. బాధ్యత మోస్తున్న పుడు అసంతృప్తి సహజం గాయత్రీ. మీ అత్తగారు తానే కూతురి వద్ద వుండొచ్చు కదా! వాళ్ళ కుటుం బాన్ని ఇక్కడికి ఎందుకు తీసుకువచ్చారు? ఇక్కడ వైద్యం బాగా జరుగుతుందని. తాను కూడా ఇక్కడే వుంటే మీ పిల్లల చదువుకీ, మీ ఉద్యోగా నికీ ఇబ్బంది కలగదని, మనిషికి మనిషి తోడని. మీ కష్టసుఖాలు సమిష్టివి గాయత్రీ! మీ కష్టం ఆమె తీరుస్తారు. ఆమె కష్టాల్లో మీరు ఆదు కుంటారు. మీ బాధ్యతను ఆమె మోస్తారు. ఆమె బాధ్యతను మీరు పంచుకుంటారు. అందువల్ల, మీ మధ్య కలతలు వస్తాయి. అభిప్రాయభేదాలొ స్తాయి. అయినా ఎందుకు విడిపోరు? ఆత్మీయత, అనురాగం అనే సిల్కుదారాలు మిమ్మల్ని కలిపే వుంచుతాయి. వాటిని తెంచడం గొప్ప కాదు గాయత్రీ! దానికి ఒక్క క్షణం చాలు. వాటిని తెగకుండా కాపాడడమే గొప్ప.

మాదీ, మా అత్తమామలదీ డ్రాయింగు రూం ప్రేమలు. మీ దగ్గరున్నంత చనువు కూడా ఆమె వద్ద నాకు లేదంటే నమ్ముతావా? బహుశా ఆమెకు కూడా అంతే. మా కష్టసుఖాలు మావి. వాళ్ళ కష్టసుఖాలు వాళ్ళవి. వాళ్ళు మామీద ఆర్థికంగా ఆధారపడి లేరు మీ అత్తమామల్లా. మాకూ వాళ్ళ డబ్బు అఖ్ఖర్లేదు. నేను వాళ్ళకి సేవ చేయను. వాళ్ళు నాకు సహాయం చేయరు. నా కొడుకు వాళ్ళని గ్రానీ, గ్రాండ్‌పా అంటాడు. వాడికి వాళ్ళ దగ్గర చనువు లేదు. వాడిని చదువు కోసం డూన్ స్కూల్లో వెయ్యనక్కర్లేదు. మా అత్తగారూ, మామ గారు హైదరాబాద్‌లోనే వున్నారు. అక్కడ పబ్లిక్ స్కూల్లో వెయ్యొచ్చు. మా మామగారు వాడి స్కూలు ఫీజుకి సంవత్సరానికి పాతిక వేలు ఇమ్మంటే ఇవ్వగలరేమోకానీ మీ అత్తగారు మీ బిడ్డని సంరక్షించినట్టు నా అత్తగారు వాడి పాలనా, పోషణా చూడలేదు. దానికి ఆత్మీయత కావాలి. ఆప్యాయత కావాలి. డూన్ స్కూల్లో వున్నాడు కాబట్టి ప్రతి పుట్టిన రోజుకీ ఫోను చేస్తారు. ఒక వెయ్యి రూపాయిలకు చెక్కు పంపుతారు. వాడికి నాయనమ్మనూ, తాతయ్యనూ గుర్తుచే సేవి అవే. మీ అత్తగారిలా చెమటోడ్చి మనుమల కోసం సున్నుండలూ, అరిశెలూ చెయ్యరు. 'పుల్లా రెడ్డి'లో స్వీట్స్ ఆర్డరిచ్చి కొరియర్‌లో డెహ్రాడూన్ పంపుతారు.

మాకు అభిప్రాయభేదాల్లేవని ఈర్ష్యపడొద్దు గాయత్రీ! అభిప్రాయభేదాలు ఆత్మీయుల మధ్య వస్తాయి. సంబంధం లేనివాళ్ళతో రావు. సంవత్స రానికి ఒకసారి మా ఇంటి డ్రాయింగ్ రూములో కల్సుకుని, వరసమ్మ వండితే తిని, చెరో వెయ్యి రూపాయిల వస్తువులు బహూకరించుకుని, విడి పోయే మా మధ్య అభిప్రాయభేదాలకి తావే లేదు. కష్టసుఖాలు, బరువు బాధ్యతలు సమిష్టివి అయిన మీ మధ్య అభిప్రాయభేదాలు రావంటే ఆశ్చర్యపో వాలి. ఏది అదృష్టం గాయత్రీ? మీదా? నాదా? ఆలోచించండి."

లూనా శబ్దం గాలిలో తేలి వచ్చి తన కర్ణపు టాలను తాకినపుడుగానీ గాయత్రికి అర్థంకాలేదు అలేఖ్య వెళ్ళిపోయిందని. వాచీ చూసుకుంది.

"అమ్మో! ఆరున్నర అయింది. ముసలావిడకి కళ్ళు కన్పించవు. వంట ఏం తగలబెడుతుందో ఏమో! అసలే అన్నయ్యగారికి పథ్యం వంట కూడాను" అనుకుంటూ గబగబా ఇంటివైపు అడు గులేసింది. *


త్వరలో
కొత్త సీరియల్
ప్రారంభం